క్లుప్తంగా

ఈతవనాలు కాపాడుకోవాలి



మొక్క నాటుతున్న ఎస్సై రమేశ్

మామడ: గ్రామాల్లో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో నాటే ఈత మొక్కలను కాపాడుకోవాలని ఎక్సైజ్ ఎస్సై రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని దిమ్మదుర్తి గ్రామంలో ఈత మొక్కలు నాటారు. గీత పారిశ్రామిక సంఘం గ్రామ అధ్యక్షుడు సురేందర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి అశ్విత, సుధాకర్, శ్రీనివాస్ గౌడ్, రత్నాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కలెక్టరేట్‌కు బస్సు

నిర్మల్‌టౌన్: నిర్మల్ బస్టాండ్ నుంచి నూతన సమీకృత కలెక్టరేట్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సును డిపో మేనేజర్ సాయన్న సోమవారం ప్రారంభించారు. రోజు ఉదయం 10 గంటలకు బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. తిరిగి సాయంత్రం 5.45 గంటలకు కలెక్టరేట్ నుంచి బయలుదేరి బస్టాండ్‌కు చేరుకుంటుందని తెలిపారు.

కఠినంగా శిక్షించాలి

ముధోల్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలు, యువతులపై అఘాయిత్యాలకు పాల్పడిన గిరిజనులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నవీన్ అన్నారు. సోమవారం ముధోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసనగా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పరమేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకు రుణం అందించాలి

కుంటాల: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన బీసీలందరికీ రూ.లక్ష రుణం అందించాలని ఎంపీపీ ఆప్క గజ్జారాంయాదవ్ పేర్కొన్నారు. సోమవారం కుంటాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం రూ.లక్ష రుణం కోసం దరఖాస్తు చేసుకున్న పలువురికి నిరాశే మిగిలిందన్నారు. వైస్ ఎంపీపీ మౌనిక, ఎంపీటీసీలు సుధాకర్, మోహన్, నాయకులు చిన్నన్‌రావు, సాయన్న తదితరులున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సర్వే




సర్వే చేస్తున్న మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు

భైంసాటౌన్: పట్టణంలోని పలు కాలనీల్లో మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సోమవారం సర్వే నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలో పారిశుధ్యం అమలుపై ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయం సేకరించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్ తెలిపారు.

'అనాథ పిల్లలకు అండగా ఉంటాం'

భైంసాటౌన్: పట్టణంలోని నేతాజీనగర్‌కు చెందిన అనాథ పిల్లలు లోగం రాం, శ్యాం, శివకుమార్‌కు అండగా ఉండి.. వారిని వసతిగృహంలో చేర్పిస్తామని బాలల హక్కుల పరిరక్షణ అధికారి సగ్గం రాజు తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు సోమవారం వారి ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. తల్లిదండ్రులు కోల్పోయి అనాథలుగా మారిన పిల్లలకు ప్రభుత్వం చేకూర్చే ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ, ఐసీపీఎస్ సామాజిక కార్యకర్త కరుణశ్రీ, ఎస్సై లింగురాం, హెడ్ కానిస్టేబుల్ సాహెబ్‌రావు, గంగభూషణ్ తదితరులున్నారు.

నోట్‌బుక్‌లు పంపిణీ



నోట్‌బుక్‌లు అందుకున్న విద్యార్థులు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం వ్యాపారవేత్త గంప అనిల్ విద్యార్థులకు రూ. 15 వేల విలువైన నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఎంఈఓ కస్తూరి శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన

లోకేశ్వరం: మండలంలోని గడ్చాంద ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి రవీందర్‌రెడ్డి వ్యాధి లక్షణాలను వివరించారు. ఏఎన్ఎం దేవమ్మ, ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది ఉన్నారు.

సమ్మెకు సర్పంచ్‌ల మద్దతు

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న పంచాయతీ కార్మికులకు సోమవారం మండలంలోని పలువురు సర్పంచ్‌లు మద్దతుగా బైఠాయించారు. సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు పార్శపు శ్రీనివాస్ మాట్లాడారు. సర్పంచ్‌లు, నాయకులు మల్లేష్, గోపాల్, చిన్నం రవి, నిమ్మానాయక్, పెద్దినర్సయ్య, గంగాధర్, మడావి లింగు తదితరులు ఉన్నారు.





ఇంద్రధనస్సు.. కనువిందు

జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం ఆకాశంలో ఏర్పడిన ఇంద్రధనస్సు పట్టవాసులను కనువిందు చేసింది. ఓవైపు చినుకులతో సన్నని వర్షం.. మరోవైపు సూర్యాస్తమయం ఏర్పడుతుండగా రెండు హరివిల్లులు ఏకకాలంలో దర్శనమిచ్చాయి. సుమారు 10 నిమిషాలు ఈ దృశ్యాలు ఆకట్టుకున్నాయి. –సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

- ఖానాపూర్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రేఖానాయక్



అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: వర్షాకాలం నేపథ్యంలో పట్టణంతోపాటు గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మోహిద్ అధ్యక్షతన ఖానాపూర్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మండలంలోని అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రజాసమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులతో ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, ఎంపీడీవో మల్లేశ్, అంకం రాజేందర్, పుప్పాల శంకర్, పరిమి సురేశ్, రాజగంగన్న, తదితరులు ఉన్నారు.

ఆసుపత్రిలో పండ్లు పంపిణీ..

అనంతరం మంత్రి కేటీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే రేఖానాయక్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పలు చోట్ల మొక్కలు నాటారు.

ఎమ్మెల్యేకు ఐసీటీసీ ఉద్యోగుల వినతి

రాష్ట్రంలో 40ఏళ్లుగా హెచ్ఐవీ బాధితులకు సేవలందిస్తున్న ఐసీటీసీ కేంద్రాలను మూసివేయాలనే కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించేలా చూడాలని కోరుతూ ఐసీటీసీ ఉద్యోగులు సోమవారం ఎమ్మెల్యే రేఖానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. హెచ్ఐవీ నిర్మూలన లక్ష్యంగా కేంద్రప్రభుత్వం న్యాకోను ఓ కార్యక్రమంగా ముందుకు తెచ్చిందన్నారు. దీంతో హెచ్ఐవీ నియంత్రణ మండళ్లను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో టీ సాక్స్ ఉద్యోగులు రాంచందర్, మహ్మద్‌సాజిద్, సురేష్, విజయ్, శైలజ, వేణు తదితరులు ఉన్నారు.

మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు



నిర్మల్‌లో కేక్ కట్ చేస్తున్న చైర్మన్ ఈశ్వర్, నేతలు



బాసర ఆలయంలో బీఆర్ఎస్ నాయకుల పూజలు



రక్తదాన శిబిరంలో జాన్సన్‌నాయక్, తదితరులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము కేక్ కట్ చేశారు. కౌన్సిలర్లు వేణు, యస్పీ రాజు, గండ్రత్ రమణ, ఆకుల రామకృష్ణ, రామగోని తులసి నర్సాగౌడ్, ముజాయిద్ చౌస్, బిట్లింగ్ నవీన్, నరేందర్, సలీం, నాయకులు, నయూం, ఖాసీం, జాపర్, సాయి పాల్గొన్నారు

ముధోల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షులు అఫ్రోజ్‌ఖాన్, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖాలీద్, పోతన్నయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, బషీర్, సంజు, బాబు, శంకర్ పాల్గొన్నారు.

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు పూజలు చేశారు. బీఆర్ఎస్ బాసర మండలాధ్యక్షుడు కోర్వశ్యామ్, బాసర సర్పంచ్ లక్ష్మణ్‌రావు, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: కుంటాలలో మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాత్రి, సర్పంచ్‌లు ముజ్జి ప్రవీణ్‌కుమార్, కిషన్, నాయకులు సుదర్శన్ రెడ్డి, శివాజీ, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెంబి: బీఆర్ఎస్ నాయకులు పెంబి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ గంగారెడ్డి, సర్పంచ్ పూర్ణచందర్ గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, విలాస్, ఇస్మాయిల్, నరేందర్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని బీఆర్ఎస్ నాయకుడు, మంత్రి కేటీఆర్ మిత్రుడు భూక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో మహారక్తదాన శిబిరం నిర్వహించారు. తనతోపాటు 50 మంది రక్తదానం చేశారు. అనంతరం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సుమారు 40 మంది సిబ్బందిని శాలువాలతో సన్మానించి, స్వీట్ బాక్స్‌లను పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు బాదనకుర్తి, గంగాయిపేట్ శివాలయాల్లో కేటీఆర్ పేరిట అర్చనలు చేయించి అన్నదానం చేశారు.

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద బీఆర్ఎస్ నాయకులు మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. వివేకానంద ఆవాసంలో విద్యార్థులకు అన్నదానం చేశారు.

సోన్: మండల కేంద్రంలోనిని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శానం గంగాధర్, అంబేకర్ ప్రసాద్, జక్కు రాజేశ్వర్, కాంతయ్య పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



భైంసాలో క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు



నిర్మల్‌లో దివ్యాంగుల భవనంలో..

భైంసాటౌన్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏలు సోమవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. వీఆర్ఏలను క్రమద్ధీకరిస్తూ జీవో విడుదల చేసినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. వీఆర్ఏల సంఘం డివిజన్, మండలాధ్యక్షులు ముత్తన్న, షేక్ చాంద్, మక్కన్న తదితరులున్నారు.

నర్సాపూర్(జి): తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వీఆర్ఏలు పీరాజీ, ఇర్ఫాన్, రాములు, రియాజ్, నరేశ్, సురేశ్, సాయన్న పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో వీఆర్ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వీఆర్ఏలు దినాకర్, భూమన్న, జమాల్, రాజేశ్వర్, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంఘ భవనంలో..

నిర్మల్‌టౌన్: దివ్యాంగుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ వారికి పెన్షన్ నెలకు రూ. నాలుగు వేలకు పెంచారని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని దివ్యాంగుల సంఘ భవనంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సలీం, ఎస్పీ రాజు, బిట్లింగ్ నవీన్, ముజాయిద్ చౌస్, దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసక్ అలీ, ఉపాధ్యక్షుడు హరిదాస్, గాంధారి శ్రీనివాస్, సయ్యద్ కైసర్, రాజేశ్వర్, లింగన్న, సోఫీ, నయూం, ఖాసీం, మహబూబ్ పాల్గొన్నారు.

కస్తూరిబాలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెంబి: మండలంలోని మందపల్లి కస్తూరిబాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెలఖారులోగా దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌వో వీణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ మీడియం ఎంపీసీలో 40, బైపీసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యార్థులు నేరుగా కస్తూరిబాకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పండ్లతోటల పెంపకానికి..

కుంటాల: ఐదెకరాల్లోపున్న రైతులు పండ్ల తోటల పెంపకానికి నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఏపీవో గట్టుపల్లి నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి, ఉద్యానవన, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటల పెంపకానికి ఒకటి నుంచి మూడేళ్ల నిర్వహణ ఖర్చులు అందిస్తారన్నారు. ఏఈవోల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'సర్పంచ్‌ను గౌరవించడం నేర్చుకోవాలి'

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మైనార్టీ మహిళా సర్పంచ్‌ను అవమానించేలా మాట్లాడటం సరికాదని, మహిళలను గౌరవించడం నేర్చుకోవాలని సారంగాపూర్ మండలం స్వర్ణ గ్రామ సర్పంచ్ అయేషా సిద్దిఖీ అన్నారు. నిర్మల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల మంత్రి ఐకేరెడ్డి స్వర్ణలో పర్యటించినప్పుడు గ్రామస్తులు అభివృద్ధిపై ప్రశ్నిస్తే పార్టీలు మారిన సర్పంచ్‌ను అడగండి అంటూ హేళనగా మాట్లాడడం మంత్రి అహంకారానికి నిదర్శమన్నారు. స్వర్ణలో రైతువేదికను తన హయాంలో నిర్మించానని ఇప్పటికీ బిల్లులు రాలేదన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

పెంబి: విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకుపోవడంతో స్థానిక మండల పరిషత్తు కార్యాలయానికి సంబంధిత అధికారులు కరెంట్ సరఫరా నిలిపివేశారు. దీంతో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నిల్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు నిరసన తెలిపారు. బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులు కార్యాలయానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

సంక్షిప్త వార్తలు

స్టేట్ కోర్ కమిటీ సభ్యునిగా గజేందర్

కుంటాల: మున్నూరు కాపు పటేల్ యూత్ ఫోర్స్ రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం ఇటీవల హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఫౌండర్ ఎర్రం తేజపటేల్, తెలంగాణ జర్నలిస్టు ఫోరం మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కుంటాలకు చెందిన గాజుల గజేందర్‌ను స్టేట్ కోర్ కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నారు.

మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలి

కుభీర్: మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలని ఎంపీడీవో లింబాద్రి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మంగళ, బుధవారం డ్రైడేగా పాటించాలన్నారు. ఎంపీవో కవిరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

28న సన్నాహక సభ

ఖానాపూర్: జిల్లాకేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించే మాదిగల విశ్వరూప సన్నాహక సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ శనిగారపు కమలాకర్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు రెండో వారంలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభకు సన్నద్ధం చేసేందుకు మందకృష్ణ మాదిగ నిర్మల్ వస్తున్నారని పేర్కొన్నారు. ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి కుదాల స్వామి, వెంకటేశ్, ప్రవీణ్, నరేందర్ తదితరులు ఉన్నారు.

కస్తూరిబాలో వైద్య శిబిరం

కుభీర్: మండల కేంద్రంలోని కస్తూరిబాలో విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. జ్వరం ఉన్నవారికి మందులు అందించినట్లు డాక్టర్ ప్రణయ్ తెలిపారు. సూపర్‌వైజర్లు సాయిబాబా, శ్రీనివాస్, ఏఎన్ఎం సరస్వతీ, ఎల్‌టీ రాధిక, శ్రీవాణి సిబ్బంది ఉన్నారు.

మామడ: మండలంలోని కస్తూరిబాలో 93 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి పలువురికి మందులు అందజేశారు. వైద్యాధికారి శ్రీకాంత్, సీహెచ్ఓ లక్ష్మన్న, సూపర్‌వైజర్ పద్మ, పాఠశాల ప్రత్యేకాధికారి జ్యోతి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల కేటాయింపుల్లో అర్హులకు అన్యాయం

- ఖానాపూర్‌లో 'డబుల్' దరఖాస్తుదారుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న పేదలు

ఖానాపూర్: పట్టణంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను అనర్హులకు కేటాయించి.. అర్హులకు అన్యాయం చేశారని పలువురు పేదలు(దరఖాస్తుదారులు) సోమవారం ఆందోళనకు దిగారు. ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే రేఖానాయక్ నివాసం వద్ద ఆందోళన నిర్వహించి ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం స్థానిక జగన్నాథ్‌రావు చౌరస్తాలో రెండు గంటలపాటు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత పేదలు మాట్లాడుతూ. ఇల్లు, ప్లాట్లు, ఉద్యోగాలున్నవారికి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించి అర్హులకు అన్యాయం చేసిందన్నారు. కలెక్టర్‌కు విన్నవించినా విచారణ చేపట్టలేదని వాపోయారు.

కాంగ్రెస్ నాయకుల మద్దతు..

కాంగ్రెస్ నాయకులు, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్, నాయకులు ప్రతాప్‌యాదవ్, సాయిరాజ్, ఫయాజ్ పేదలకు మద్దతుగా బైఠాయించారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం పేదలు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాజమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు నంది రామయ్య, చిన్నం సత్యం, సబ్బిర్‌పాషా, అమానుల్లాఖాన్, శంకర్, రాజశేఖర్, రాధ, కవిత, సరస్వతి ఉన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ ప్రవీణ్ కుమార్



హోంగార్డు కూతుర్లకు చెక్కు అందిస్తున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఇటీవల మృతిచెందిన హోంగార్డు కుటుంబానికి జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో రూ.30 లక్షల ప్రమాద బీమా చెక్కును సోమవారం అందజేశారు. లోకేశ్వరం పోలీస్ స్టేషన్ లో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న తుంగేన నర్సింగ్‌రావు నిజామాబాద్ జిల్లాలో గత ఏప్రిల్ ఆరో తేదీన హనుమాన్ శోభాయాత్ర బందోబస్తుకు వెళ్లి రాత్రి తిరిగి వస్తుండగా మొహాల ఎక్స్ రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించాడన్నారు. అతని కుటుంబంలో ఒకరికి బాసర టిపుల్ ఐటీలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించామని తెలిపారు. పోలీసులు, యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌కు నర్సింగ్‌రావు కుటుంబ సభ్యులు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.

నాన్న మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నాం..

అమ్మ లేని లోటు తెలియకుండా అన్ని తానై తమ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన నాన్న అకాల మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని నర్సింగ్‌రావు కుమార్తెలు ప్రియాంక, ప్రణవి తెలిపారు. చిన్నతనంలోనే అమ్మ చనిపోగా, తమకు నాన్న ఏ కష్టం రాకుండా పెంచి పెద్దచేశారన్నారు. తమకు ఆర్థికసాయం అందించిన ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు ఎస్పీ(ఏఆర్) వెంకటేశ్వర్లు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు రమేశ్, రామకృష్ణ, లోకేశ్వరం ఎస్సై సాయికుమార్, యాక్సిస్ బ్యాంక్ సిబ్బంది, హోంగార్డ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల ఐక్యతకు కృషి



ప్రమాణ స్వీకారం చేసిన కార్యవర్గం

నిర్మల్: జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపుల ఐక్యత, అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని మున్నూరు కాపు మిత్రమండలి నూతన అధ్యక్షుడు గంట రాకేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని దివ్యగార్డెన్‌లో ఆదివారం సాయంత్రం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడు గంట రాకేశ్, ఉపాధ్యక్షులు ఒడ్నం నరేందర్, మర్కుంట అనిల్, ప్రధాన కార్యదర్శి ఆకుల ప్రవీణ్, సంయుక్త కార్యదర్శులు జాప సందీప్, పూదరి శివకుమార్, కోశాధికారి ఆరె చిరంజీవి, ఉప కోశాధికారి ఇప్ప చంద్రశేఖర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా వీరిని సన్మానించారు. సంఘ బలోపేతం, అభివృద్ధికి సహకరించాలని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంట రాకేశ్, ఆకుల ప్రవీణ్ కోరారు.

రేషన్‌డీలర్, ఎఫ్ఏపై గ్రామస్తుల ఫిర్యాదు

భైంసారూరల్: మండలంలోని సుంక్లి గ్రామ రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో డీటీ సూర్యప్రకాశ్‌కు ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా కొందరు లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదని విచారణ జరిపి డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధిహామీ పథకంలో అవకతవకలకు పాల్పడుతున్న సుంక్లి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. 35 నుంచి 45 రోజులు పనులు చేసిన కూలీలకు 15 రోజులు మాత్రమే హాజరు వేస్తున్నారని వాపోయారు. అర్హులకు జాబ్ కార్డులు ఇవ్వకుండా కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వెల్లడించారు. గ్రామస్తులు ముత్యం రెడ్డి, నర్సయ్య, వినాయక్‌రావు ఉన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాలు పంపిణీ



పరికరాలను విద్యార్థులకు అందిస్తున్న నారాయణ

లక్ష్మణచాంద: వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని సహకార కళాశాల అధ్యక్షుడు కొట్టూరి నారాయణ పేర్కొన్నారు.మండల కేంద్రంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నడుస్తున్న సహకార జూనియర్ కళాశాల విద్యార్థులకు వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా రూ.50 వేల విలువైన క్రీడా వస్తువులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ బ్రహ్మన్న, ప్రిన్సిపాల్ భోజన్న, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నందికి పాలు తాగిస్తున్న భక్తులు

- జిల్లాకేంద్రంలో వింత ఘటన



పాలు తాగిస్తున్న భక్తులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని బేస్తవారిపేట రాజరాజేశ్వర కాలనీలో వింత ఘటన చోటు చేసుకొంది. రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకొని నందీశ్వరుడి విగ్రహానికి పాలు పోస్తుండగా.. పాలు తాగుతుండటంతో భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ వార్త వైరల్ కావడంతో ఈ వింతను తిలికించేందుకు భక్తులు తరలివచ్చారు. పలువురు స్వయంగా పాలు పోస్తుంటే విగ్రహం తాగడంతో ఆశ్చర్యపోతున్నారు. పరమ శివుడి లీలంటూ భక్తులు పూజలు చేశారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

సోన్: సోన్ గోదావరి బ్రిడ్జిపై నుంచి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన యువకుడిని పోలీసులు కాపాడారు. ఎస్సై సంతోషం రవీందర్ కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా దూదిగాం గ్రామానికి చెందిన వినోద్(26) ఆత్మహత్య చేసుకునేందుకు సోమవారం గోదావరి బ్రిడ్జి వద్దకు వచ్చాడు. గమనించిన ప్రయాణికులు 100 డయల్‌కు సమాచారం అందించారు. పెట్రోకార్ సిబ్బంది శేఖర్, శివకుమార్ అక్కడికి చేరుకుని యువకుడిని కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఎస్సై రవీందర్, సీఐ నవీన్‌కుమార్ అభినందించారు.

మొక్కలు పంపిణీ

లోకేశ్వరం: హరితహారంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో సోలమాన్ రాజ్ అన్నారు. సోమవారం మండలంలోని నర్సింహనగర్ తండాలో మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఏ రవీందర్, ఎఫ్ఏ సికిందర్ ఉన్నారు.